సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 19 । జూన్ । 2025



పెన్షన్ ప్లీజ్..!

డప్పు కళాకారులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. వందలాది మందికి పింఛన్లు ఇంకా రాలేదు. - 10లో



రిక్వెస్ట్ బదిలీలకు చాన్స్

రిక్వెస్ట్ బదిలీలకు అధికారులు అవకాశం కల్పించారు. నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. - 10లో

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

ఇచ్ఛాపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఇచ్ఛాపురం పట్టణంతో పాటు మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గటల వరకు కరెంటు ఉండదని పలాస విద్యుత్ ఈఈ యజ్ఞేశ్వరరావు తెలిపారు.

న్యూస్‌రీల్

చెవిరెడ్డిని అరెస్టు చేయడం అరాచకం



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: లేని మద్యం స్కామ్‌ను చూపించి చంద్రబాబు ప్రభుత్వం అనేక మంది వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరావును అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అరాచకానికి చెవిరెడ్డి అరెస్టు పరాకాష్ఠ అని అన్నారు. ఆయన అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి సిట్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరులో అదుపులోనికి తీసుకున్న వరకూ చెవిరెడ్డి ఈ కేసులో నిందితుడిగా నమోదు కాలేదని పేర్కొన్నారు. ఈ కేసులకు భయపడేది లేదని తెలిపారు.

'జనగణనతో పాటు కుల గణన చేపట్టాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జనగణనతో పాటు కుల గణన తప్పనిసరిగా చేపట్టాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు టి.తిరుపతి రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం వెలువరించిన గెజిట్ నోటిఫికేషన్‌లో కులగణన చేస్తామని స్పష్టత లేకపోవడం, మోదీ ప్రభుత్వం యూ టర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోందన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కులగణన చేయడం ద్వారా ప్రభుత్వానికి మరింత సామాజిక అంశాలలో జవాబుదారీతనం ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి సిద్ధం కావడం అభినందనీయమని తెలిపారు. 2020లో జరగాల్సిన ప్రక్రియను, కరోనా కారణంగా వాయిదా వేశారని గుర్తుచేశారు. కులగణనలో భాగంగానే ఆయా కులాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర అంశాలను పరిశీలన చేసి గణన చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలో ఉంది కాబట్టే కుల గణన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతి పదేళ్లకు జరగాల్సిన జన గణన, స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి 7 సార్లు మాత్రమే చేశారని గుర్తుచేశారు.

'నిరుద్యోగ భృతి ఇవ్వాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ విమర్శించారు. శ్రీకాకుళం పట్టణంలో ఉన్న పలు కోచింగ్ సెంటర్లలో జూన్ 15 నుంచి జులై 15 వరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ/ ఉపాధి/నిరుద్యోగ భృతి సాధనకై ఐదు లక్షల అర్జీలను రాష్ట్ర గవర్నర్, సీఎంకు పంపించే దరఖాస్తును నిరుద్యోగులకు అందించి పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు ప్రతి పక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు 20 లక్షల ఉద్యోగాలు, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తానని మాటిచ్చారని, ఆ మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. కేవలం 16 వేల పోస్టులకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మిగతా శాఖల ఉద్యోగాల గురించి, నిరుద్యోగ భృతిని మర్చిపోయారని విమర్శించారు. దీన్ని ప్రభుత్వానికి గుర్తు చేయడానికి గవర్నర్, సీఎంకు అర్జీలు పంపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, ఏఐవైఎఫ్ నాయకులు వై.వేణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 25 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



సమీక్ష చేస్తున్న ఫారెస్టు అధికారి

నరసన్నపేట: ఈ వర్షాకాలంలో జిల్లాలో 25 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా ఫారెస్టు అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆయన అటవీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేరకు మొక్కలను సిద్ధం చేస్తున్నామని, వివిధ శాఖల అధికారుల సహకారంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సబ్‌డివిజనల్ డీఎఫ్‌ఓ బి.నాగేంద్ర, ఫారెస్టు రేంజ్ అధికారులు జగదీశ్, రాజశేఖర్, వెంకటరమణ,, శ్రీనివాసరావు, నరేంద్ర, జనప్రియ పాల్గొన్నారు.

వంశధారలో విధ్వంస రచన!



- నైరలోని వంశధార నదిపై పడ్డ ఇసుక అక్రమార్కులు
- నీటి పథకం, గ్యాస్ పైపు లైన్ వద్ద ఇసుక తవ్వకాలకు సన్నద్ధం
- ఇప్పటికే నదిలోకి రోడ్డేసిన పాలక పెద్దలు
- ఇసుక దొంగలపై చర్యలు తీసుకోకపోతే ముప్పు తప్పదు
- ముందే గుర్తించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఈ ఫొటో చూడండి. శ్రీకాకుళం రూరల్‌లోని నైర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 265లో గల వంశధార నదిలో 20 ఏళ్ల కిందట రూ.18కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా స్కీమ్‌కు సంబంధించి ఇన్‌ఫిల్టరేషన్ బావి ఇది. అలికాం, సింగువలస వద్ద నిర్మించిన ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా దాదాపు 42 గ్రామాలకు తాగునీరందించే ప్రాజెక్టు ఇది. ఇలాంటి ప్రాజెక్టు ధ్వంసమయ్యే పరిస్థితి దాపురించింది. దీనికి దగ్గరలోనే ఇసుక తవ్వకాలకు సిద్ధమవుతున్నారు. తవ్వకాలు జరిగితే తాగునీటి జలాలు అడుగంటిపోతాయి. వాస్తవానికి సీపీడబ్ల్యూ స్కీమ్‌కు 500మీటర్లలో ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదు. కానీ పాలక పెద్దల అండతో ధ్వంసరచనకు పూనుకున్నారు. ఇలాంటి ప్రాజెక్టు కొత్తగా నిర్మించాలంటే రూ.40కోట్లకు పైగా వ్యయమవుతుంది.



వంశధార నదిలో ఇసుక అక్రమాల కోసం అడ్డంగా వేసిన రోడ్డిది. అనుమతుల్లేకుండా రోడ్డు వేశారు. ఆ రోడ్డుకు దగ్గరలో రక్షిత మంచినీటి పథకం, గెయిల్ గ్యాస్ పైపు లైన్ ఉంది. ఇక్కడ తవ్వకాలు చేపట్టి, రవాణా చేస్తే ముప్పు తప్పదు. ఇక్కడే బైరిదేసి గెడ్డ కాలువ గట్టును కూడా ధ్వంసం చేసి, ఇసుక లారీల రవాణా కోసం తాత్కాలిక రోడ్డు నిర్మించారు. వాస్తవానికి 40టన్నుల సామర్థ్యం గల లారీల రవాణాకు కాలువ గట్టులు పనికి రావు. కానీ, అధికారులు చోద్యం చూస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం వచ్చాక కనీసం ఒక సమగ్ర రక్షిత నీటి సరఫరా స్కీమ్(సీపీడబ్ల్యూఎస్) నిర్మించలేదు. పబ్లిసిటీతో కాలం గడిపేసి ఉన్న స్కీమ్‌లను ధ్వంసం చేసే పరిస్థితులను తీసుకొస్తోంది. తమ నేతల జేబులు నింపడానికి ఉన్న వనరులను అర్పించేస్తోంది. నీటి వనరులు పోతే ఏంటి? గ్యాస్ పైపులైన్‌కు ముప్పు వాటిల్లితే మాకేంటి? కాలువ గట్లు ఛిద్రమైతే నష్టమేంటి? అని ప్రభుత్వమే విధ్వంసానికి సహకరిస్తోంది. నైర దగ్గర వంశధారలో జరుగుతున్న అడ్డగోలు కార్యకలాపాలతో భవిష్యత్‌లో ప్రమాదం పొంచి ఉన్నట్టే కనబడుతోంది.

దోపిడీకి బాటలు..

జిల్లాలో ఇసుక దోపిడీ ఏ స్థాయిలో జరుగుతోందో ప్రజలందరికీ తెలుసు. నదీ తీర ప్రాంతం లేని నియోజకవర్గాలు తప్ప మిగతా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇసుకను దోచేస్తున్నారు. అడ్డగోలుగా తవ్వకాలు జరిపి, అక్రమంగా తరలించి రూ.వేల కోట్లు వెనకేసుకున్నారు. ఉచిత ఇసుక ముసుగులో ఒక్కో నాయకుడు రూ. కోట్లలో సంపాదించుకున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా, రక్షిత మంచినీటి పథకాలు, వంతెనలు, కరకట్టలు అని చూడకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రోడ్లు ఛిద్రమవుతున్నా, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా లెక్క చేయకుండా భారీ ట్రక్కుల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. యంత్రాంగం జారీ చేసే బిల్లులను పోలిన బిల్లులను నకిలీ డివైజ్‌లతో సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో జరుగుతున్న దోపిడీ అంతా ఇంతా కాదు. నదీ తీర ప్రాంతాలను ఇసుక తవ్వకాలతో ధ్వంసం చేస్తున్నారు. లోతైన గోతులతో ప్రమాదకరమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. వర్షాలు పడి వరదలు వస్తే ఎక్కడ ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో తవ్వకాలు చేయగా, తాజాగా నైరపై పడ్డారు. నైరలోని వంశధార నదిలో అనుమతి లేకుండానే అన్నీ జరుగుతున్నాయి. కానీ, అధికారులు కన్నెత్తి చూడటం లేదు.



నదిలోకి వేసిన రోడ్డు పక్కనే గ్యాస్ పైపు లైన్ హెచ్చరిక బోర్డు

ముప్పును గుర్తించి కలెక్టర్‌కు ఫిర్యాదు



నైరలో జరుగుతున్న ధ్వంస రచనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాగునీటి ప్రాజెక్టు, గెయిల్ గ్యాస్ పైపు లైన్, బైరిదేసి గెడ్డ గట్టు తదితర వాటికి ఇసుక అక్రమార్కులు తలపెడుతున్న హానిని ముందే గుర్తించిన శ్రీకాకుళం రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు అప్రమత్తమై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక రవాణాకు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వొద్దని, ఇస్తే వనరులు ధ్వంసమవుతాయని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో ఎంపీపీ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రతినిధి ఎచ్చెర్ల శ్రీధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షులు రౌతు శంకరరావు, సానివాడ ఎంపీటీసీ రుప్ప అప్పలసూరి, శ్రీకాకుళం అసెంబ్లీ యువజన విభాగం అధ్యక్షులు గొండు హరీష్, ఊటపల్లి కృష్ణారావు, శిమ్మ భగవాన్ దాస్ తదితర నాయకులతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

జన సమీకరణం



- యోగాంధ్ర కోసం అధికారుల పాట్లు
- జనసమీకరణ చేసి తీసుకురావాల్సిందే అని ఉన్నతాధికారుల హుకుం
- 'అమరావతి సభ' ఖర్చులే నేటికీ రాని పరిస్థితి
- యోగా డే కార్యక్రమానికి వెళ్లేవారికి స్నాక్స్ పెట్టాలంటూ ఐసీడీఎస్ సూపర్ వైజర్లకు ఆదేశం
- రాత్రి 2గంటలకు జనాలను తరలించాలంటూ సచివాలయం ఉద్యోగులకు ఆదేశం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అమరావతి రాజధాని పునఃప్రారంభోత్సవ కార్యక్రమ జనసమీకరణ కోసం అధికారులు, ఉద్యోగులు ఆపసోపాలు పడ్డారు. నయానోభయానో చేసి, సొంత సొమ్ము ఖర్చు పెట్టుకుని జనాలను తీసుకెళ్లారు. ఇప్పుడేమో విశాఖపట్నంలో ఈ నెల 21 జరిగే యోగా డే కోసం జన సమీకరణ చేసి తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మెప్పు కోసం రెండు కార్యక్రమాలకు జనాలు తరలించే బాధ్యతను అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి అప్పగించారు. ప్రభుత్వం కేటాయిస్తామనేది తక్కువ, ఖర్చు అయ్యేది ఎక్కువ కావడంతో అధికారులు నలిగిపోతున్నారు. దానికి తోడు యోగా డే కోసం ముందు రోజు రాత్రి 2 గంటలకు జనాలను తరలించే బాధ్యతను తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆ సమయంలో మహిళలను ఎలా తీసుకెళ్లాలో అని సచివాలయ ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. బయలుదేరిన వాళ్లకు డబ్బుల సంగతి పక్కన పెట్టి, వారికి అవసరమైన స్నాక్స్ అందజేసే బాధ్యత తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులకు అప్పగించారు. ముందు డబ్బులివ్వకుండా ఖర్చు పెడితే వెనక్కి వస్తాయో రావో తెలియని పరిస్థితిలో ఆందోళన చెందుతున్నారు.

మొన్నటి స్నాక్స్ సొమ్మే రాలేదు... మళ్లీనా?



అమరావతిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో రాజధాని పునఃప్రారంభోత్సవ కార్యక్రమం రోజున జిల్లా నుంచి పెద్ద ఎత్తున బస్సులు ద్వారా జనాలను తరలించారు. ఆ సమయంలో బస్సులు, భోజనాలు కోసం చేసిన ఖర్చు ప్రభుత్వం వెనక్కి ఇచ్చిందో లేదో తెలీదు గానీ వెళ్లిన వారికి అందజేసిన స్నాక్స్ ఖర్చు ఇంతవరకు ఇవ్వలేదు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చెందిన ఉద్యోగులే స్నాక్స్ భారాన్ని మోశారు. ఒక్కొక్కరికీ రూ.వేలల్లో ఖర్చయ్యింది. ఆ సొమ్ము ఇంతవరకు జమ చేయలేదు. తాజాగా విశాఖలో జరిగే యోగా డే కోసం తరలించే వారికి కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు(సూపర్‌వైజర్లు) స్నాక్స్ ఖర్చులు భరించాలని ఉన్నతాధికారులు సెలవిచ్చారు. దీంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులు బుధవారం జూమ్ మీటింగ్ పెట్టి స్నాక్స్ ఖర్చులు పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ మీటింగ్‌లో కొంతమంది సూపర్‌వైజర్లు జోక్యం చేసుకుని అమరావతికి తరలించిన జనాలకు ఖర్చు పెట్టిన స్నాక్స్ సొమ్మే ఇంతవరకు రాలేదని, యోగా డేకు తరలించే జనాలకు ఎలా ఖర్చు పెట్టగలమని అడిగితే.. డబ్బులు సంగతి తర్వాత చూద్దాం, ముందు ఖర్చు పెట్టండని ప్రాజెక్టు అధికారి దాటవేయడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 16 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఒక్కో ప్రాజెక్టు నుంచి 3వేల మందిని తరలించడమే లక్ష్యంగా పెట్టారు. ఈ లెక్కన ఒక్కో ప్రాజెక్టుకు స్నాక్స్ ఖర్చు రూ.80వేల వరకు, జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు రూ.11లక్షల వరకు ఖర్చవుతుంది. ఇదంతా సూపర్‌వైజర్లు భరించాల్సి ఉంటుంది.

రాత్రి 2గంటలకు జనాలను తరలించాలట..

ఏం చేస్తారో తెలీదు గానీ జనాలను తీసుకురావల్సిందేనని హుకుం జారీ చేయడంలో అధికారుల దగ్గరి నుంచి సిబ్బంది వరకు తలలు పట్టుకుంటున్నారు. జన సమీకరణ చేయడమే కష్టమనుకుంటే రాత్రి 2గంటలకు బయలుదేరించి, బస్సుల ద్వారా తీసుకురావాలని సచివాలయ ఉద్యోగులకు బాధ్యత అప్పగించారు. ఆ సమయంలో జనాలను బయలుదేరించడమంటే కష్టమేనని ఉద్యోగులు అంటున్నారు. కానీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలు కావడంతో కక్కలేక, మింగలేక సచివాలయ ఉద్యోగులు సతమతమవుతున్నారు. వాస్తవంగా, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు స్వచ్ఛందంగా జనాలు వచ్చే పరిస్థితి లేదు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి కార్యక్రమాల పేరుతో జనాలు తరలించడం, వారికయ్యే ఖర్చులు భరించడం తలకుమించిన భారమే కాదు కత్తిమీద సాములా తయారైంది.

సాగు మీది.. సాయం మాది



సాక్షి ఇంటర్వ్యూ

ఖరీఫ్ పనులు మొదలయ్యాయి. జిల్లాలో మొత్తం ఖరీఫ్ సాగు విస్తీర్ణం వరి 1.50లక్షల హెక్టార్లుగా లక్ష్యం నిర్ణయించారు. ఈ ఏడాది రైతులకు అందించే విత్తనాలు, ఎరువుల పంపిణీ విషయంలో సందిగ్ధత ఇంకా వీడలేదు. ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధత ఎలా ఉందో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.త్రినాథ స్వామి వివరించారు. ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ

- వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాధస్వామి సాక్షితో ముఖాముఖి
- ఈ యేడు సాగు విస్తీర్ణం పెంచినట్లు వెల్లడి
- సేంద్రియ ఎరువులు వాడాలని సూచన

సాక్షి: ఈ ఏడాది సాగు లక్ష్యం ఎంత..? విత్తనాల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జేడీ: ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు లక్ష్యం 1.50లక్షల హెక్టార్లుగా నిర్ణయించాం. గత ఏడాది కంటే 6421 హెక్టార్లు పెంచాం. విత్తనాలు వరి 38,499 క్వింటాళ్లు లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటివరకు ఏపీ సీడ్స్ ద్వారా దాదాపు 30వేలు క్వింటాళ్ల పైచిలుకు విత్తనాలు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశాం.

సాక్షి: యంత్రాల వాడకం ఎలా ఉంది?

జేడీ: సులువుగా వ్యవసాయం చేసుకునేందుకు కావాల్సిన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోంది. సీడ్‌డ్రిల్, దుక్కుదున్నే యంత్రాలు, నారు యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నాం. రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.



సాక్షి: అధిక దిగుబడులు రావాలంటే పాటించాల్సిన సూత్రాలు?

జేడీ: విత్తన ఎంపిక అనేది చాలా కీలకం. నాట్లు వేసే పద్ధతి అయితే అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. వరిపూత దశకు వచ్చే సమయంలో కాలిబాటలు తీయాలి.

సాక్షి: రైతు సేవా కేంద్రాల పరిస్థితి ఏమిటి?

జేడీ: జిల్లాలో 838 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. రైతు వివరాలు నమోదు చేసుకుంటే అన్ని సేవలు ఈ కేంద్రాల నుంచే అందిస్తున్నాం. సేవలు అంతంతమాత్రమే అన్న ఆరోపణలు సరికాదు.

సాక్షి: ఈ ఏడాది తుఫాన్లు ఎక్కువగా ఉంటాయని తెలుస్తోంది. ముందస్తుగా ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా..?

జేడీ: మన జిల్లాకు ఎప్పుడూ తుఫాను ముప్పు పొంచి ఉంటుంది. జూన్‌లోనే నాట్లు వేయడం మొదలైతే ముందస్తుగా పంటకాలం పూర్తయ్యి తుఫాన్ల బారిన పడకుండా రైతులు గట్టెక్కవచ్చు. తుఫాన్లకు తట్టుకునే రకాల విత్తనాలు 1210-సుజాత, 1061 -ఇంద్ర, 1064-అమర, స్వర్ణ-7029, శ్రీధృతి-1121, సాంబ-5204, శ్రీకాకుళం సన్నాలు-2531లు వంటి విత్తనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

సాక్షి: ఎరువులు వాడకం తగ్గిందా. పెరిగిందా?

జేడీ: ఎరువుల వాడకం తగ్గిస్తేనే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. శక్తివంతమైన ఆహారం అందుతుంది. వ్యవసాయ పనులు సులువుగా చేసుకునేందుకు రైతులు ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. దీంతో నాణ్యమైన దిగుబడులు రాకపోగా చీడపీడలు అధికమవుతాయి. సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యతనివ్వాలి.

సాక్షి: జిల్లాలో అగ్రిల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉంది?



జేడీ: జిల్లాలో జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌తో కలిపి మొత్తం 9 ఉన్నాయి. అందులో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అగ్రిల్యాబ్‌కి మిషనరీ రాలేదు. జిల్లా కేంద్రంలో ల్యాబ్ ఇంకా ప్రారంభం కాలేదు. మిగిలిన 7 ల్యాబ్‌ల్లో విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునేందుకు అన్ని రకాల సేవలు అందిస్తున్నాం.

సాక్షి: వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల పరిస్థితి ఎలా ఉంది..?

జేడీ : ప్రజల ఆహార అలవాట్లు మారాయి. దాన్ని బట్టి వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, గంటెలు, సామలు, కొర్రలు, కందులు, మొక్కజొన్నలు వేసేలా ప్రోత్సహిస్తున్నాం. వరికి సుమారు 150రోజులు పంట కాలం ఉంటుంది. మిగిలిన పంటలకు 90నుంచి 120 రోజుల్లోపే మంచి దిగుబడులు వస్తాయి. లాభాలు ఎక్కువగా వస్తాయి.

సాక్షి: సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ఆసక్తి ఉందా?

జేడీ: జిల్లాలో 35వేల ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం జరుగుతుంది. కానీ వరుసగా మూడేళ్లు సేంద్రియ వ్యవసాయం చేస్తేనే దాన్ని లెక్కలోకి తీసుకుంటాం. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది.

సాక్షి: కౌలు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఎలా ఉంది?

జేడీ: భూ యజమానులతో పాటు సమానంగా కౌలు రైతులకు అన్ని రకాల పథకాలు అందిస్తున్నాం. ఇప్పటికే 9800 మందికి సీసీఎల్‌ఏ కార్డులు అందించాం. ఉచిత పంటల బీమా కూడా వర్తించేలా చేస్తాం. కౌలు పత్రం ఉంటే ఈ-పంట నమోదు చేసుకుంటేనే పరిహారాలన్నీ అందుతాయి. భూయజమాని కౌలుదారుని అగ్రిమెంట్ రెన్యువల్ ఏటా చేయాలి.

సాక్షి: రైతులకు వ్యవసాయ రుణాలు సకాలంలో అందిస్తున్నారా?



జేడీ: ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు అన్నదాత సుఖీభవ డబ్బులు త్వరలోనే పడతాయి. రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. గత ఏడాది తీసుకున్న రైతులకే కాకుండా మరో 10శాతం మంది రైతులకు అదనంగా రుణాలు మంజూరు చేస్తాం.

గాజు సీసాలో పట్టెడ మంచం



టెక్కలి మెట్టవీధికి చెందిన సింహాద్రి సోమేశ్వరరావు కార్పెంటర్ వృత్తి చేస్తుంటారు. సూక్ష్మ కళపై ఆసక్తితో వినూత్నంగా ఏదైనా చేయాలనే ఆలోచనతో గాజు సీసాలో పట్టెడ మంచాన్ని రూపొందించి అబ్బురపరిచారు. కార్పెంటర్ ప్రతిభపై స్థానికులు అభినందించారు.

– టెక్కలి



కార్పెంటర్ సోమేశ్వరరావు



క్లుప్తంగా

ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రూరల్ మండలంలోని కల్లేపల్లిలో ఉన్న సంప్రదాయ కూచిపూడి గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులం డైరెక్టర్ స్వాతీ సోమనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి నృత్యంలో శిక్షణ కోసం 2025–26 ఏడాదికి గాను జూలై 1 నుంచి ప్రవేశాలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 98491 07426 నంబరును సంప్రదించాలని కోరారు.

యోగాంధ్ర పోటీల్లో మూడో స్థానం



తృతీయ బహుమతి అందుకుంటున్న చంద్రశేఖర్

టెక్కలి: యోగాంధ్ర పోటీల్లో భాగంగా ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పాటల పోటీలు, యోగా పోటీల్లో టెక్కలి సాయికృష్ణ యోగా కేంద్రం గురువు గేదెల చంద్రశేఖర్ రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచారు. విజయవాడలో నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో భాగంగా ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, టూరిజం శాఖా మంత్రి దుర్గేష్ చేతులమీదుగా చంద్రశేఖర్ బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు యోగా కేంద్రం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ముగ్గురు జేఎల్స్‌కు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా నుంచి ముగ్గురు జూనియర్ లెక్చరర్లను ప్రిన్సిపాళ్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 28వ తేదీన సీనియారిటీ జాబితా ప్రకారం పదోన్నతలకు అర్హత సాధించిన జేఎల్స్ జాబితాను ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. తాజాగా వారి ఆప్షన్ ప్రకారం కౌన్సెలింగ్ జరిపి ప్రిన్సిపాళ్లగా నియామక ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. జిల్లా నుంచి బి.చంద్రమౌళి (ఫిజిక్స్ లెక్చరర్–ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఆమదాలవలస)ను మెళియాపుట్టి జీజేసీ ప్రిన్సిపాల్‌గా, పి.సౌజన్య (కామర్స్ లెక్చరర్– ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల,శ్రీకాకుళం)ను బారువ జీజేసీ ప్రిన్సిపాల్‌గా, చింతాడ శరత్ బాబు (జువాలజీ లెక్చరర్– ప్రభుత్వ జూనియర్ కళాశాల,మందస)ను ఇచ్ఛాపురం జీజేసీ బాలురు ప్రిన్సిపాల్‌గా నియమించారు. వీరిని పలువురు లెక్చరర్లు, ఉద్యోగులు అభినందించారు.

గ్రంథాలయం అభివృద్ధికి చర్యలు

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (అఅఐ) తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను అందించేందుకు ముందుకు వచ్చిందని వెల్లడించారు. రాష్ట్రంలోనే ఒక ప్రముఖ మోడల్ గ్రంథాలయంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు, పాఠకులకు ఉపయోగపడే సౌకర్యాలతో ఇది స్టేట్ ఆఫ్ ఆర్ట్ గ్రంథాలయంగా అభివృద్ధి చేయబడుతుందన్నారు. ఈ నిధులను జిల్లా పాలనా యంత్రాంగమే వినియోగించనుందని, ఎలాంటి ప్రైవేటీకరణ అంశం ప్రస్తావనకే రాలేదని స్పష్టం చేశారు. గ్రంథాలయం పూర్తిస్థాయిలో ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉంటుందని, ఇప్పటికే ప్రజా ఆస్తిగా ఉన్న ఈ గ్రంథాలయం భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగుతుందన్నారు. గ్రంథాలయం ప్రైవేటీకరణ చేస్తారనే అసత్య ప్రచారాలు నమ్మవద్దని తేల్చి చెప్పారు. గ్రంథాలయ అభివృద్ధి పూర్తయిన తర్వాత విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఇది ఎంతో ఉపయోగపడే కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పెన్షన్ ప్లీజ్..!



దప్పులు వేడి చేస్తున్న కళాకారులు



- కొత్త పింఛన్ల కోసం డప్పు కళాకారుల ఎదురుచూపులు
- కూటమి హయాంలో కలగని మోక్షం
- ఏడాదిగా నిరీక్షిస్తున్న వందలాది మంది
- పట్టించుకోని అధికారులు, నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: డప్పు కొడితే గానీ డొక్కలు నిండని బతుకులు వారివి. అమ్మవారి సంబరాలు, పెళ్లిళ్లు ఇలా వేర్వేరు సందర్భాల్లో డప్పు దరువు వినిపించాల్సిందే. అవే దళిత డప్పు కళాకారుల కుటుంబాల కడుపులు నింపేవి. అనాది వాయిద్య కళకు ప్రాణం పోసే ఈ కళాకారులు కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్‌కు నోచుకోని అభాగ్యులుగా మారారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 50 ఏళ్లు నిండిన డప్పు కళాకారులు ఐదేళ్ల కాలంలో ప్రతీ ఏడాది జనవరి, జూన్ నెలల్లో పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకొని పింఛన్లు పొందేవారు. అయితే 2024 జనవరి నుంచి మే నెల వరకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన డప్పు కళాకారులకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపించింది. ఇప్పటికీ గ్రామ సచివాలయాల్లో వారి దరఖాస్తులు మూలుగుతున్నాయి. ఏడాదిలో జిల్లాలో మరో వంద మంది వరకు పింఛన్‌కు అర్హత సాధించినవారు దరఖాస్తులు చేసేందుకు ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వం దరఖాస్తులు తీసుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం జిల్లాలో 1984 మంది డప్పు కళాకారులు పింఛన్ పొందుతున్నారు. ప్రాచీన కళను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నందున ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులైన డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని, ప్రతీ డప్పు కళాకారుడికి గుర్తింపు కార్డులు, వయోపరిమితి లేకుండా ఆరువేల పింఛన్ మంజూరు చేయాలంటూ జిల్లా డప్పు కళాకారుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది. అదేవిధంగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సంబంధం లేకుండా గ్రామ, వార్డు సచివాలయం ద్వారానే అర్హులుగా గుర్తించాలని డప్పు కళాకారులు కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం



నా వయస్సు ప్రస్తుతం 52 సంవత్సరాలు. నా చిన్నతనం నుంచి డప్పు కళను నమ్ముకొని జీవనం సాగిస్తున్నాను. డప్పు కళాకారులకు ప్రభుత్వం పింఛన్ ఇస్తుందని ఏడాది క్రితం దరఖాస్తు చేశాను. అయితే ప్రస్తుతం సైట్ ఆగిపోయిందని చెప్పడంతో ఏడాది నుంచి ఎదురు చూస్తున్నాను. నాలాంటి కళాకారులు జిల్లాలో వందలాది మంది దరఖాస్తు చేసేందుకు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం డప్పు కళాకారుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే బాగుంటుంది. – **కొప్పల భీమారావు, డప్పు కళాకారుడు, కేశుపురం, ఇచ్ఛాపురం మండలం**

తక్షణమే మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా జిల్లాలో అర్హులైన ఒక్క డప్పు కళాకారుడికి కూడా నూతనంగా పింఛన్లు మంజూరు చేయకపోవడం దారుణం. అర్హులైన డప్పు కళాకారులకు నెలకు రూ.6 వేల పింఛన్ అందజేయాలి. అదేవిధంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలి. ఇప్పటివరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకున్న డప్పు కళాకారులకు తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. – **డి.గణేష్, గౌరవ అధ్యక్షుడు, డప్పు కళాకారుల సంఘం, శ్రీకాకుళం**

గతేడాది దరఖాస్తు చేసుకున్నాను



మాకు డప్పు వాయిస్తే గానీ జీవనం సాగదు. నాకు 50 ఏళ్లు నిండడంతో గతేడాది జనవరిలో డప్పు కళాకారుల పింఛన్ కోసం మా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. జూన్ నెలలో కొత్త పింఛన్ వస్తుందని అధికారి చెప్పడంతో ఎంతగానో సంతోషించాను. అయితే ఈలోపు ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త పింఛన్లు ఇవ్వడం లేదంటూ సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో ఏడాదిగా పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాను. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నాకు మంజూరు చేస్తుందని ఎదురు చూస్తున్నాను.

– కల్యాణి గున్నయ్య, డప్పు కళాకారుడు, బొడ్డబడ, ఇచ్ఛాపురం మండలం

రిక్వెస్ట్ బదిలీలకు ఛాన్స్..!

- అవకాశం కల్పించిన రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు
- నేటి నుంచి దరఖాస్తులకు అవకాశం



సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖకు అనుబంధమైన సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రిక్వెస్ట్ బదిలీలకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీనికి సంబంధించి పూర్తిస్థాయి విధివిధానాలు లేకుండా రిక్వెస్ట్ బదిలీలకు సంబంధించి అధికారులు ప్రకటనలు విడుదల చేశారు. ఈ ప్రకటన సారాంశం ప్రకారం ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ కార్యాలయం శ్రీకాకుళం జిల్లా కార్యాలయంలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులు మెయిల్ ద్వారా కేజీబీవీలకు చేరవేయడం జరిగిందని, అలాగే ఎంఈవో, డీఈవో కార్యాలయాల్లో సైతం అందుబాటులో ఉంచారని, అదేవిధంగా శ్రీకాకుళం డీఈవో అధికారిక వెబ్‌సైట్ డీఈవోఎస్‌కేఎల్.ఓఆర్జీ వెబ్ పోర్టల్‌లో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

గతంలో పారదర్శకం

జిల్లాలో సమగ్ర శిక్ష పరిధిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 1,210 మంది వరకు పనిచేస్తున్నారు. వీరిలో ఖాళీలు ఉన్న చోటుకు, ఉద్యోగులు పరస్పర (మ్యూచువల్) అంగీకార పద్ధతిలో బదిలీలు నిర్వహించేందుకు స్టేట్ ఎస్పీడీ అవకాశం కల్పించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్దేశిత సీనియారిటీ ప్రకారం కోరుకున్న చోటుకు 2020, 2023లో అత్యంత పారదర్శకంగా బదిలీలు చేపట్టారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల జేబులు నింపేందుకు, ఉద్యోగులతో అనేక రకాలుగా పైరవీలు చేసుకునేందుకు రిక్వెస్ట్ బదిలీలకు తెరతీసినట్టుగా సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పది కేటగిరిల్లో దరఖాస్తులు

పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో 30 మండలాల పరిధిలో 10 కేటగిరిల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులుకానున్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్పీస్), పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు (పీటీఐలు), క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సీఆర్‌ఎంటీలు), మండల్ స్థాయి అకౌంటెంట్లు, సైట్ ఇంజినీర్లు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, కార్యాలయ సబార్డినేటర్లు పోస్టులకు రిక్వెస్ట్ ప్రాతిపదికపై బదిలీలు జరపనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హ్యూమానిటీస్ గ్రౌండ్‌లో రిక్వెస్ట్ బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఖాళీలు ఉన్నచోట, మ్యూచువల్ అంగీకార పద్ధతిలో స్థాన చలనం జరిపించేలా రాష్ట్ర అధికారులు నిర్ణయించారు. జిల్లాలో సమగ్రశిక్షా పరిధిలో పనిచేస్తున్న 10 కేటగిరి ఉద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 21లోగా దరఖాస్తులు నేరుగా జిల్లా ఏపీసీ కార్యాలయంలో సమర్పించాలి. – **డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, సమగ్రశిక్షా జిల్లా ఏపీసీ, శ్రీకాకుళం**

విద్యార్థుల భవిష్యత్ ఏమవ్వాలి..?

- రవీంద్రభారతి యాజమాన్యాన్ని నిలదీసిన తల్లిదండ్రులు



రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యాన్ని నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

టెక్కలి: ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టానుసారం వ్యవహరిస్తే పిల్లల భవిష్యత్ ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. ఇటీవల రవీంద్రభారతి పాఠశాలను అధికారులు మూసివేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ స్థానికంగా ఉన్నటువంటి మరో ప్రైవేటు పాఠశాలలో తరగతులు నిర్వహించేందుకు యాజమాన్యం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో బుధవారం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులంతా ఆ పాఠశాల వద్దకు వెళ్లి రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిని గట్టిగా నిలదీశారు. నిన్నటివరకు ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాలను ఎలా నిర్వహించారని, ఇప్పుడు మరో పాఠశాలలో తరగతులు నిర్వహిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. దీంతో కొంత సమయం గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. పాఠశాలను మూసివేయడం, నిన్నటి వరకు మరలా పాఠశాలను తెరుస్తామని తల్లిదండ్రులకు బుజ్జగించడం, ఇప్పుడు మరో పాఠశాలలో తరగతులు నిర్వహిస్తామని చెప్పడంతో రవీంద్రభారతి పాఠశాలలో చదివిన విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది. చివరగా విద్యార్థులకు సంబంధించిన టీసీలు ఇస్తామని యాజమాన్యం చెప్పడంతో తల్లిదండ్రులు వెనుదిరిగారు.

రొంపివలస విద్యార్థికి గోల్డ్ మెడల్



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో దేశవ్యాప్తంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో టాటా కంపెనీ(టీసీఎల్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్లాస్టిక్ పొల్యూషన్ రెమెడీస్ బ్యూడింగ్ మోడ్రన్ ఇండియా వ్యాస రచన పోటీల్లో పాతపట్నం మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థిని లూకలాపు చాందిని జాతీయ స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. దీంతో ఈనెల 15వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చాందినికి గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం, ధ్రువీకరణ పత్రం, రూ.35 వేల విలువ గల బహుమతిని అందజేశారు.

అనంతరం ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్ము అభినందించారు. అలాగే ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్ తిరుమలరావు, హెచ్‌ఎం ఎస్.కుమారస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్దానంలో సినీ సన్నివేశాలు చిత్రీకరణ



నటులకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని ఉద్దాన ప్రాంతంలో సైలార్ క్రియేషన్ బ్యానర్‌పై ఆర్.రాముడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కలియుగ ధర్మరాజు' చలన చిత్ర సన్నివేశాలను బుధవారం చిత్ర యూనిట్ చిత్రీకరించారు. యదార్థ సంఘటనలపై ఓటీటీ వేదికగా చలనచిత్రాన్ని చిత్రీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ప్రముఖ నటుడు డాక్టర్ కుమార్ నాయక్ ప్రధాన ప్రతి నాయకుడిగా, నటీనటులుగా సంజయ్, రజిని, రమ్య నటిస్తున్నారు. షూటింగ్ చూసేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు తరలి వచ్చారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.రమణ, పీఆర్వో శ్రీనివాస్, మడ్డు జశ్వంత్, నటీనటులు క్రాంతి, భారతి తదితరులు ఉన్నారు.

తల్లులకు తిప్పలు











తల్లికి వందనం పథకం అందుకోవడానికి మాతృమూర్తులు ఆపసోపాలు పడుతున్నారు. అనేక కుటుంబాలకు విద్యుత్ బిల్లు అధికంగా ఉండడం కారణంగా పథకం అందలేదనే కారణాన్ని ప్రభుత్వం చూపడంతో, తక్కువ విద్యుత్ బిల్లు వస్తోందని నిరూపించుకోవడానికి ప్రయాసలు పడుతున్నారు. దీనిలో భాగంగా ఆరు నెలల విద్యుత్ రీడింగ్‌ను పొందేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో పలాస డివిజన్ విద్యుత్ కార్యాలయంలో తల్లిదండ్రులు, పిల్లలు దరఖాస్తులు నింపుకుని వేలాది మంది పాట్లు పడుతున్నారు. – కాశీబుగ్గ

వరద నీటిలో గుళ్లలపాడు



ఇంటి ముందు చేరిన వరద నీరు

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినవంక పంచాయతీ గుళ్లలపాడులో వరద నీటి నిల్వతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వారం రోజుల కిందట కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వారు బుధవారం వరద నీటిలో నిలబడి ఆందోళన, నిరసన వ్యక్తం చేశారు. వారం రోజులుగా దుర్వాసన, దోమల మోత భరించలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



పలాస సీహెచ్‌సీలో అత్యవసర వైద్యం అందిస్తున్న నర్సులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కేటీరోడ్డులో విద్యుత్ కార్యాలయం ఎదురుగా బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటీతో అతివేగంగా వచ్చిన స్థానిక యువకుడు రోడ్డుపక్కన పనసతొనలు అమ్ముకుంటున్న కంచిలి మండలం కంచిలి గ్రామానికి చెందిన సిమ్మ ఆదమ్మను ఢీకొనడంతో తలకు వెనుకభాగంలో తీవ్రగాయమై రక్తస్రావమైంది. స్థానికులు యువకుడు, అతని వాహనాన్ని పట్టుకుని కాశీబుగ్గ పోలీసులకు అప్పగించారు. మహిళను పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులు అత్యవసర వైద్య సేవలు అందించారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో పట్టణంలో మితిమీరిన వేగంతో యువకులు ప్రయాణించడం, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, కాలం చెల్లిన వాహనాలతో ప్రయాణిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతినెలా 10వ తేదీలోపు జీతాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీపీటీడీ ఆర్టీసీ నందు శ్రీకాకుళం జిల్లాలోని నాలుగు డిపోల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతినెలా 10వ తేదీలోపు జీతాలను చెల్లించాలని ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికశాఖ అధికారికి ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఆర్టీసీ శ్రీకాకుళం–1, 2 డిపోలతో పాటు టెక్కలి, పలాస డిపోల్లో దాదాపుగా 220 మంది కార్మికులు ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారన్నారు. వీరికి ఆర్టీసీ యాజమాన్యం ద్వారా వచ్చే వేతనాలను కాంట్రాక్టర్లు ద్వారా చెల్లిస్తున్నారని. కాంట్రాక్టర్లు తీసుకునే సెవెన్ పర్సెంట్ ప్రాఫిట్ మార్జిన్ కాకుండా, అదనంగా రూ.2 వేల నుంచి రూ.3 వేలు వరకూ కార్మికులకు ఇచ్చే జీతాల్లో కాంట్రాక్టర్లు కార్మికుల కష్టాన్ని దోచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు సమస్యను గతంలో పలుమార్లు జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్‌కుమార్, లేబర్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

ఆదేశాలు పట్టించుకోవడం లేదు

జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్‌కుమార్ ఫిబ్రవరిలో కాంట్రాక్టర్లు, కార్మికుల మధ్య సయోధ్య కుదిర్చినా కాంట్రాక్టర్లు అధికారుల ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘం తరపున 23వ తేదీ సోమవారం నుంచి ప్రత్యక్ష ఆందోళన, నిరసన కార్యక్రమాలు, ధర్నాలను నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్‌కుమార్‌కు, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ రాజు, శ్రీకాకుళం 1 డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు, శ్రీకాకుళం 2 డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ, టెక్కలి డిపో మేనేజర్ శ్రీనివాసరావు, పలాస డిపో మేనేజర్ ఆర్.ఎస్.నాయుడు తదితరులకు తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి కిరణ్, జిల్లా ట్రెజరర్ ఆర్.నవీన్‌కుమార్, ఏపీపీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.